క్లుప్తంగా

అంధకారంలో 'లోహా'



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

దహెగాం: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం లోహాలో గత మూడు రోజులుగా కరెంటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం గాలి, ఉరుములతో కూడిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోగా నేటికీ విద్యుత్‌ను పునరుద్ధరించలేదు. అసలే వర్షాకాలం ప్రారంభం కావడంతో రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేనందున ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్జి గ్రామానికి వచ్చి సెల్‌ఫోన్‌లను చార్జింగ్ పెట్టుకుంటున్నామని వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌ను సంప్రదించగా గురువారం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, దాని స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీంలు



అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్‌చార్జి సునీత

రెబ్బెన: బాలికలు, మహిళల రక్షణ కోసమే షీటీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. మండలంలోని కొండపల్లిలో శనివారం ఉపాధిహామీ కూలీలకు షీ టీంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళల పట్ల ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేసి సత్వర సహాయం పొందవచ్చన్నారు. నిమిషాల వ్యవధిలో పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు సహాయం అందిస్తారన్నారు. బాధితులు ఆసిఫాబాద్ షీటీంను 8712670564 నంబర్ ద్వారా సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు శ్రీలత, స్వప్న, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ దేవానంద్ పాల్గొన్నారు.

యూనిఫామ్‌లు అందజేత



యూనిఫామ్‌లను హెచ్‌ఎం నారాయణకు అందజేస్తున్న సత్తయ్య

కెరమెరి: మండలంలోని కల్లెగాం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థుల యూనిఫామ్‌లను శనివారం వీవో సభ్యురాలితో కలిసి ఐకేపీ సీసీ సత్తయ్య ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నైతం నారాయణకు అందజేశారు. 12న పాఠశాలలు పునఃప్రారంభం రోజు విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేయనున్నట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

బోథ్: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయని జడ్జి హుస్సేన్ తెలిపారు. బ్యాంకు అదాలత్ ద్వారా 36 కేసుల్లో రూ. 39,75,000లు రికవరీ అయ్యాయని, నేరం ఒప్పుకోవడం వల్ల 18 కేసులు, స్పెషల్ టరమ్స్ అండ్ కండీషన్స్(ఎస్టీసీ) కేసులు 103, ఎక్సైజ్ కేసులు 51, రాజీమార్గం ద్వారా 25 కేసులు పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావు దేశ్‌పాండే, అంగద్ కేంద్రే, మోహన్ రావ్, పంద్రం శంకర్, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్, జమీర్, ధమ్మపాల్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, బోథ్ ఎస్సై రాము, బజార్‌హత్నూర్ ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టితో ప్రమాదాలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని రోడ్డుపై నెలకొన్న మట్టితో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. లక్ష్మణచాంద, పొట్టపెల్లి(కె) గ్రామాల రైతులు మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై ఇటీవల వరిధాన్యం ఆరబెట్టుకున్నారు. వర్షం కురిస్తే వరద వెళ్లకుండా రైతులు పంట కుప్పల చుట్టూ మట్టి పోశారు. కానీ పంటను అమ్ముకున్న తర్వాత రైతులు మట్టిని తొలగించకుండా అలానే వదిలేశారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు ఈమార్గంలో వాహనదారులు మట్టి జారి కింద పడుతున్నారు. గతంలోనూ పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న మట్టి తొలగించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు

- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- అక్రమంగా నడుస్తున్న పెద్ద వాహనాలు
- కలగానే రెండు వరుసల రోడ్డు



కెరమెరి ఘాట్‌రోడ్డులో మూలమలుపు వద్ద భారీ వాహనం

కెరమెరి: ఆర్అండ్‌బీ అధికారులు రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కెరమెరి ఘాట్‌లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలోని కెస్లాగూడ గ్రామం నుంచి మొత్తం 9 కిలోమీటర్ల మేర ఘాట్ రోడ్డు విస్తరించి ఉంది. ఈ రోడ్డులో 37 మూల మలుపులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఘాట్ రోడ్డు చిన్నదిగా సింగిల్ రోడ్డు ఉండడంతో తరుచూ వాహనాలు బోల్తా కొడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి.

ఆదిలాబాద్‌కు వెళ్లే మార్గం..

ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే కెరమెరి ఘాట్ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. ఇతర మార్గాలు లేకపోవడంతో ప్రతీరోజు ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, జీపులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు అధిక సంఖ్యలో వెళ్తుంటాయి. అయితే 50ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డును ఇప్పటికీ విస్తరించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతం పూర్తిగా రిజర్వు ఫారెస్టు కావడంతో అటవీ అధికారులు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదు. ఇప్పటికీ ఐదేళ్లలో రెండు సార్లు మరుమ్మతులు చేపట్టినప్పటికీ రోడ్డు విస్తరణ పనులు మాత్రం చేయలేదు.

పెద్ద వాహనాలతో ఇబ్బందులు

ఈ రోడ్డు పై పది టైర్ల వాహనాలతో పాటు భారీ బరువుగల వాహనాలు వెళ్లడానికి అనుమతి లేదు. కానీ ఇటు వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్లేందుకు ఎలాంటి టోల్‌గేట్‌లు లేకపోవడంతో అతి బరువు గల వాహనదారులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అయినా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మూల మలుపుల వద్ద అనేక భారీ వాహనాలు బోల్తా కొట్టి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. కాగా రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయడంతో వానలు కురిసినప్పుడు బురదగా మారి వాహనాలు దిగబడుతున్నాయి. ఒక వాహ నం వెళ్తున్నప్పుడు ఎదురుగా మరో వాహనం వస్తే సైడ్ ఇవ్వడానికి డ్రైవర్లు నానా తిప్పలు పడుతున్నారు. అనేక ప్రాంతాల్లో డివైడర్లు కూడా లేకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సింగిల్ రోడ్డు ఉండడం వల్ల వాహనాలు పడిపోతున్న సంఘటనలు తరుచూ జరుగుతున్నాయి. గతంలో ఘాట్ రోడ్డుపై డబుల్ రోడ్డు వేయాలని అధికారులకు విన్నవించాం. రిజర్వు ఫారెస్టు ఏరియా కావడంతో అనుమతులు లభించలేదని అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రయత్నిస్తాం.

– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

గుడుంబా నిర్మూలనకు సహకరించాలి



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రెబ్బెన: గ్రామాల్లో గుడుంబా, అక్రమ మద్యం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ ఎస్సై రమేశ్ అన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు శనివారం ఎక్సైజ్ సీఐ దీపక్ ఆధ్వర్యంలో మండలంలోని తుంగెడ, ధర్మారం గ్రామాల పరిసర ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సుమారు 400 లీటర్ల బెల్లం పానకాన్ని నేలమట్టం చేసి గుడంబా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గుడంబా తయారీ, అక్రమ మద్యంపై ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే ఎక్సైజ్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. గుడుంబా, నాటుసారా మూలంగా ఎంతో మంది జీవితాలు నాశనమవుతున్నాయని, సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలు కృషి చేయాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు సురేశ్, కమలాకర్, మమత, రజిత తదితరులు పాల్గొన్నారు.

వరద రాకుండా చర్యలు చేపట్టాలి

ఖానాపూర్: పట్టణంలోని జేకేనగర్, రాజీవ్‌నగర్ కాలనీల్లోకి అటవీ ప్రాంతం నుంచి వరద రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని జేకేనగర్ శివారు అటవీ ప్రాంతంలో ఉన్న ముంపు ప్రభావిత చెక్‌డ్యాంలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు ముందస్తుగా చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయాలన్నారు. కందకాలు తవ్వి చర్యలు తీసుకుంటేనే వరద ప్రభావం లేకుండా చూడవచ్చని కాలనీవాసుల సమక్షంలో అధికారులతో మాట్లాడారు. యూసుఫ్‌ఖాన్, రాజు, మల్లేశ్, సాగర్ ఉన్నారు.

మృగశిర కార్తె.. చేపలకు డిమాండ్



పీపీరావు ప్రాజెక్టు వద్ద చేపల కోసం బారులు తీరిన ప్రజలు

దహెగాం: మృగశిర కార్తె ప్రారంభం కావడంతో చేపలకు భలే డిమాండ్ ఏర్పడింది. శని వారం మండలంలోని కల్వాడ సమీపంలో గల పీపీరావు ప్రాజెక్టులో జాలర్లు చేపలు పట్టడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రాజెక్టు వద్ద ప్రజలు బారులుదీరారు. మృగశిర కార్తె రోజు చేపల కూర తినాలని ఆసవాయితీ ఉండడంతో ప్రాజెక్టు వద్ద కొనుగోలుదారుల సందడి కనిపించింది. ఈ సందర్భంగా విక్రయదారులు కిలో చేపలను రూ.200 నుంచి రూ. 300 వరకు విక్రయించారు.



జిల్లాకేంద్రంలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఆసిఫాబాద్‌అర్బన్: మృగశిర కార్తె సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ సందడిగా మారింది. ప్రజలు పెద్ద ఎత్తున చేపలు కొనుగోలు చేశారు. ఇదే అదునుగా చేపల వ్యాపారం చేసే వాళ్లు అధిక ధరలకు చేపలను విక్రయించారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తాం

ఎదులాపురం: ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తామని బ్రాహ్మణ మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు విశ్వాస్ నిర్మల్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి రామాలయంలో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో చదువులో ప్రతిభ కనబరిచిన నిరుపేద బ్రాహ్మణ విద్యార్థులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువులో ఆర్థిక సాయం అందించడంతో పాటు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి సంతోశ్ టేంబెకర్, కోశాధికారి ధనుంజయ్, బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుడు అన్నోజుల సంతోశ్, కోశాధికారి అభిలాష్, అరుణ్ రావు, జయసింహారావు, హరీశ్ జోషి, విజయసారథి పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై శిక్షణ

కడెం: మండల కేంద్రంలోని రైతువేదికలో కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఆయిల్‌పాం రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పాం సాగుఖర్చులు, ప్రభుత్వం ఇచ్చే రాయితీ, తెగుళ్ల నివారణకు చర్యలు, ఇతర యాజమాన్య పద్ధతులను ఉద్యానశాఖ క్లస్టర్ అధికారిణి సాదుల మౌనిక వివరించారు. ఆయిల్ పాం మార్కెటింగ్ తదితర అంశాలపై ప్రియూనిక్ కంపెనీ జిల్లా జనరల్ మేనేజర్ మల్లేశ్వర్ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రియూనిక్ కంపెనీ ఒప్పంద పత్రాలను రైతులకు అందజేశారు. ఏరియా మేనేజర్ వనోజ్‌రెడ్డి ఉన్నారు.

లక్ష్మణచాంద ఎస్సైగా సుమలత

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద నూతన ఎస్సైగా సుమలత నియమితులయ్యారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన శ్రీకాంత్ బదిలీపై సారంగాపూర్ మండలానికి వెళ్లగా నిర్మల్‌రూరల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బి.సుమలత లక్ష్మణచాందకు వచ్చారు. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన ఎస్సైకి సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

పొలాల వద్ద ఎరువుల నిల్వ



చింతలమానెపల్లి: పంటలు సాగు చేసే సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రైతులు ముందుగానే ఎరువులను నిల్వ చేసుకుంటున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో రైతులు వర్షాకాలం ఆరంభంలో ఎరువులను పొలాల వద్దకు చేరవేసి కర్రలతో తయారు చేసిన గద్దెలపై నిల్వ చేస్తున్నారు. వర్షాలు పడితే రహదారులకు దూరంగా ఉండే పంట పొలాలకు ఎరువులను తరలించడం కష్టమని, అందుకే ముందుగానే ఎరువులను తరలిస్తున్నట్లు పేర్కొంటున్నారు. వర్షం పడినా తడవకుండా ఎరువులపై టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు.

ఉపాధ్యాయుల ఇంటింటి సర్వే



విద్యార్థుల సర్వే నిర్వహిస్తున్న హెచ్‌ఎం

కెరమెరి: బడిబాటలో భాగంగా మండలంలోని 83 ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులు ఇంటింటా సర్వే నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి బడి బయట పిల్లలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు, చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి న మోదు చేసుకున్నారు. సర్వే ఈనెల 10 వరకు కొనసాగుతుందని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

వైద్యుడు లేని వైద్యశాల

- వైద్యాధికారిని నియమించని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చింతలమానెపల్లి: జిల్లాలోని మారుమూల మండలాల్లో వైద్య సేవలందక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చింతలమానెపల్లి మండలంలోని పీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యుడిని నియమించకపోవడంతో మండలవాసులు అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో సుమారు 30వేల జనాభా ఉంది. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉండే మండలంలో ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ సేవలపైనే ఆధారపడుతుంటారు. మండలంలోని రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మండల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందిస్తున్నారు. రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం గతంలో డిస్పెన్సరీగా ఉండేది. కాగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తూ 12 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చింది. నూతన భవనాన్ని అన్ని వసతులతో ఏర్పాటు చేసింది. కానీ మొదటి నుంచి ఇక్కడ వైద్యుడి నియామకంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండలవాసులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో పని చేసిన హెడ్ స్టాఫ్‌నర్స్ గత నాలుగు నెలల క్రితం బదిలీపై వెళ్లగా నాలుగు నెలలుగా పోస్టు ఖాళీగా ఉంది. డిప్యూటేషన్‌పై ఇక్కడ వైద్యుడిగా నియమించిన అజీముద్దీన్ తిరిగి తన పోస్టింగ్ లింగాపూర్‌కు వెళ్లగా ప్రస్తుతం వైద్యుడి పోస్ట్ ఆరు నెలలుగా ఖాళీగా ఉంది.

ప్రజల తిప్పలు

మండలం కాగజ్‌నగర్ పట్టణానికి 50కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈక్రమంలో ఇక్కడి ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలే దిక్కు. పొరుగు మండలాలు కౌటాల, బెజ్జూర్ ఆరోగ్య కేంద్రాలలో సైతం వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆర్ఎంపీలను లేదా నాటు వైద్యాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని బాలాజీ అనుకోడ, గంగాపూర్, గూడెం తదితర గ్రామాలలో ఇటీవల ప్రజలు తీవ్ర జ్వరాలతో ఇబ్బందులు పడ్డారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కానీ పల్లె దవాఖానా వైద్యాధికారితో వైద్యశిబిరం నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆర్థికంగా భారం..

మండలంలో ప్రజలకు వైద్య సేవలందని పరిస్థితిలో ప్రజలు ఆర్ఎంపీలను, ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం కాగజ్‌నగర్ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లడం వారికి భారంగా మారింది. మరోవైపు సరైన సమయంలో వైద్యం అందక పరిస్థితి విషమించి ప్రజలు మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈనేపథ్యంలో మండలంలో రెగ్యులర్ వైద్యాధికారిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నియమిస్తాం..

మండలంలోని బాబాపూర్ -రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని నియమించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నియమించేందుకు పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో లేరు. మండలంలో అవసరం ఉన్నందున డిప్యూటేషన్‌పై నియమించి అనంతరం పూర్తిస్థాయిలో వైద్యుడిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సీతారాం నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

సమస్యల పరిష్కారానికి కృషి

బోథ్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని ధన్నూర్ (బి), నాగాపూర్ గ్రామాల్లో పర్యటించారు. నాగాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య, రోడ్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. ధన్నూర్ (బి)లో వంతెన నిర్మాణానికి రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. గ్రామంలో పలువురు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాల్ల ఇంద్రారెడ్డి, అధికార ప్రతినిధి చంటి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయకుమార్ రెడ్డి, గజానంద్, సుభాష్, అభిరెడ్డి, వినిత్ రెడ్డి, భోజారెడ్డి, గోవింద్, మోర స్వామి పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో పూజలు

ఇచ్చోడ: సిరిచెల్మ మల్లన్న ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో మల్లన్న భక్తులు, రైతులు ఆలయంలోని గర్భగుడిలో విత్తనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మల్లన్న ఆశీర్వదంతో ఈఏడాది పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా పడి దిగుబడులు రావాలని వేడుకున్నారు. ఆలయం రైతులతో సందడిగా మారింది.

బాధిత కుటుంబాలకు పరామర్శ

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు కొండపురం రాజశేఖర్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బాధిత కుటుంబసభ్యులను మున్నూరుకాపు సంఘం ముధోల్ నియోజకవర్గ అధ్యక్షుడు రోళ్ల రమేశ్ పరామర్శించారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు మంద లింగన్న, రాజేశ్వర్, భోజన్న, చిన్నయ్య, దేవేందర్, నాలం గంగాధర్, కారడిరి గంగాధర్ పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వత్‌లో పిడుగుపాటుతో మృతి చెందిన బాలుడి కుటుంబసభ్యులను శనివారం బీజేపీ నాయకులు, మోహన్‌రావ్ ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావ్‌పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి తన వంతుగా ఆర్థికసాయం అందించారు. నాయకులు జ్ఞానేశ్వర్, రమేశ్, నాయకులు తదితరులు ఉన్నారు.

వ్యాధుల నిర్మూలనకు గుళిక మందు

ఆదిలాబాద్‌టౌన్: ఉబ్బసం, ఆయాసం, అస్తమా వంటి అనేక వ్యాధుల నిర్మూలనకు గుళిక మందు దోహదం చేస్తుందని ఆయుర్వేద వైద్యుడు యువరాజ్ వైద్య అన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో ఆయుర్వేద గుళికల పంపిణీ చేశారు.

రోడ్లపై పశువులు వదిలితే చర్యలు

భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారి భీమారం మండల కేంద్రంలో రాత్రి వేళ పశువులు వదిలితే వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని శనివారం ఎస్సై రాములు హెచ్చరించారు. రాత్రివేళ వేగంగా వెళ్లే వాహనాల డ్రైవర్లకి రోడ్లపై ఉంటున్న గేదెలు కనపడపోవడంతో, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో మరింత పెరిగాయన్నారు. పశువుల యజమానులు వాటిని ఇంటివద్దే ఉంచుకోవాలని కోరారు. పశువులను రోడ్లపై వదిలివేయడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటికి వాటి యజమానులే బాధ్యత వహించాలన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చాయోచ్..!

బెల్లంపల్లి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. బెల్లంపల్లి మండలంలో శుక్రవారం పుస్తకాలు సరఫరా కాగా, వెను వెంటనే పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో చదువుతున్న 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు 80శాతం వరకు వచ్చాయి. మరో 20శాతం పుస్తకాలు రెండో విడతలో సరఫరా కానున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఆయా తరగతులకు సంబంధించి మొత్తం 18,751 పాఠ్యపుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకోగా వీటిని ఎంఈవో మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ఆయా తరగతులకు సంబంధించి కొన్ని సబ్జెక్టుల పుస్తకాలు సరిపడినంతగా రానట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు సరఫరా చేసి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.